# సంగారెడ్డి

నమస్తే తెలంగాణ
సోమవారం 16 జూన్ 2025
MONDAY, JUNE 16, 2025



నాయీబ్రాహ్మణులకు స్థలం కేటాయిస్తూ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేతలు

## కుల సంఘాల అభివృద్ధికి కృషి చేస్తాం

రామచంద్రాపురం, జూన్ 15: కుల సంఘాల అభివృద్ధికి కృషి చేస్తామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం తెల్లాపూర్‌లో మరనాత చర్చికి 80 గజాలు, నాయీబ్రాహ్మణ సంఘానికి 150గజాల ప్రభుత్వ స్థలాలను కేటాయిస్తూ ప్రొసీడింగ్ పత్రాలు ఆయా సంఘాలకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సోమిరెడ్డి, రాములుగౌడ్, బుచ్చిరెడ్డితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెల్లాపూర్‌లో గతంలో నాయీబ్రాహ్మణులకు, చర్చి సభ్యులకు ఇచ్చిన మాట ప్రకారం స్థలాలు కేటాయిస్తూ ప్రొసీడింగ్ పత్రాలు అందజేసినట్లు తెలిపారు. సమాజంలో వెనుకబడిన వర్గాల ఆర్థిక అభ్యున్నతికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు సోమిరెడ్డి, రాములు గౌడ్ మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో నాయీబ్రాహ్మణులకు, మరనాత చర్చి సభ్యులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నట్లు తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు దేవేందర్‌యాదవ్, మాజీ కౌన్సిలర్లు లచ్చిరాంనాయక్, శ్రీశైలం, నాగరాజు, బాబ్జీ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ



మాజీ సర్పంచ్ కుటుంబీకులను పరామర్శిస్తున్న మఠం భిక్షపతి

అందోల్, జూన్ 15: ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన కిచ్చన్నపల్లి గ్రామ మాజీ సర్పంచ్ జనార్దన్‌గౌడ్ కుటుంబ సభ్యులను ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి ఆదివారం పరామర్శించారు. జనార్దన్‌గౌడ్ పార్టీ, గ్రామాభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని ఆయన సేవలను కొనియాడారు. కుటుం బ సభ్యులకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీనిచ్చారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ రామాగౌడ్ ఇతర నాయకులున్నారు.

## వీడియో జర్నలిస్టు శ్రీనివాస్‌కు నివాళి



శ్రీనివాస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జర్నలిస్టులు

నారాయణఖేడ్, జూన్ 15: సంగారెడ్డిలో వీడియో జర్నలిస్టుగా పని చేసిన సిర్గాపూర్ మండలం కడ్పల్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ శనివారం అకాల మరణం చెందారు. ఆదివారం నారాయణఖేడ్‌లోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో స్థానిక జర్నలిస్టులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కొన్నేండ్లుగా వీడియో జర్నలిస్టుగా పనిచేస్తూ చురుకైన పాత్ర పోషించిన శ్రీనివాస్ అకాల మరణం చెందడం విచారకరమని జర్నలిస్టు అన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు సయ్యద్ ఆసిఫ్, అలీమ్, అమృతం, జీవన్‌రావు, వెంకట్‌రాములు, గోవర్ధన్‌రెడ్డి, మధు, కైసర్ భూమయ్య, జావెద్, వెంకటేశం, రాములు, సయ్యద్, నిసార్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ విధానాలతో దేశానికి నష్టం



మాట్లాడుతున్న సైకిలాబ్ బాబు

సంగారెడ్డి, జూన్ 15: కేంద్రంలోని బీజేపీ సర్కారు అనుసరిస్తున్న విధానాలతో ప్రజల్లో వైషమ్యాలు పెరుగుతున్నాయని, మత రాజకీయాలు దేశానికి నష్టం చేకూరుస్తాయని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సైకిలాబ్‌బాబు అన్నారు. ఆదివారం కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అతిమేల మాణిక్ ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలోని కేవల్ కిషన్ భవన్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సైకిలాబ్ బాబు మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని రద్దు చేయడానికి కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నదని ఆరోపించారు. మోదీ పాలనలో వ్యవస్థలు విచ్ఛిన్నం అవుతున్నట్లు తెలిపారు. మోదీ సర్కారు వ్యవహరిస్తున్న విధానాలను వ్యతిరేకించడానికి దళిత, బడుగు బలహీన వర్గాల ప్రజలు సంఘటితం కావాలని కోరారు. సమావేశంలో కేవీపీఎస్ జిల్లా నాయకులు శివకుమార్, సుభాష్, నరసింహులు, మల్లేశ్, గణపతి, రాజు, దాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి మాజీ జడ్పీటీసీ విరాళం



ఆలయ కమిటీ సభ్యులతో మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి

జిన్నారం, జూన్ 15: జిన్నారం మండల కేంద్రంలోని ఎస్సీ బస్తీలో నూతనంగా పునర్నిర్మాణం చేపడుతున్న పోచమ్మ గుడికి మాజీ జడ్పీటీసీ కొలను బాల్‌రెడ్డి లక్ష రూపాయల విరాళాన్ని స్థానిక బీఆర్ఎస్ నాయకులకు ఆదివారం ఆయన నివాసంలో అందజేశారు. ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువత నాయకులు వెంకటేశం గౌడ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు శ్రీధర్ గౌడ్, లింగం, శ్రీకాంత్ గౌడ్, నిఖిల్ గౌడ్, ఎల్లయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి హామీలు అమలయ్యేనా..



పీచెర్యాగడి జడ్పీ ఉన్నత పాఠశాల

కోహీర్, జూన్ 15: కోహీర్ మండలంలోని పీచెర్యాగడి జడ్పీ ఉన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హామీచ్చారు. ఏప్రిల్ 19న పాఠశాల ఆవరణలో ప్రధాన మంత్రి కృషి సంచాయ్ యోజన పథకం ప్రారంభానికి హాజరైన మంత్రి దామోదర రాజనర్సింహకు సమస్యలపై విద్యార్థులు వినతిపత్రం అందజేశారు. తమ పాఠశాల భవనానికి పెయింటింగ్ చేయించాలని కోరారు. భవనానికి ప్రహరీ లేక పశువులు, పందులు ఆవరణలో సంచరిస్తున్నాయని మంత్రి దృష్టికి తెచ్చారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని వేడుకున్నారు. పాఠశాల హెచ్‌ఎం సురేశ్, విద్యార్థులు కలిసి సమర్పించిన వినతిపై స్పందించిన మంత్రి , వాటిని వెంటనే పరిష్కరిస్తామని హామీనిచ్చారు. పెయింటింగ్ ఖర్చు, ప్రహరీ నిర్మాణం, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయిస్తామన్నారు. విద్యార్థులు కోరిన పనులకు నిధులు కూడా పెద్దగా అవసరం లేదు. కానీ, మంత్రి హామీనిచ్చి రెండు నెలలు కావస్తుండడం, పాఠశాల విద్యా సంవత్సరం ప్రారంభమైనా హామీ అమలు కాకపోవడంతో సమస్యల పరిష్కారానికి వారు ఇతర మార్గాలను అన్వేషిస్తున్నారు.

### దాతల సహాయంతో పెయింటింగ్..

పీచెర్యాగడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చారు. గ్రామానికి చెందిన ప్రముఖ నాయకుడు తన వంతుగా రూ.60 వేలు పెయింటింగ్ కోసం విరాళమిచ్చారు. పాఠశాల హెచ్‌ఎం సురేశ్, ఉపాధ్యాయ బృందం కలిసి మరో రూ.40వేలు పోగు చేశారు. లక్ష రూపాయల ఖర్చుతో పాఠశాల భవనానికి పెయింటింగ్ పూర్తి చేయించి అందంగా తయారు చేయించారు. విద్యార్థుల అవసరార్థం కవేలి సెయింట్ గోబెన్ పరిశ్రమ ఆధ్వర్యంలో మరుగుదొడ్లు నిర్మించి అందుబాటులోకి తెచ్చారు. కానీ, తాము మంత్రి దామోదరకు విన్నవించినా ప్రహరీ నిర్మాణం, సీసీ కెమెరాల ఏర్పాటు చేయిస్తారో లేదోనని విద్యార్థులు చర్చించుకుంటున్నారు. తాము అందించిన వినతిని మరోసారి మంత్రి పరిశీలించాలని వారు వేడుకున్నారు. పెయింటింగ్ వేయించిన దాతలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

# కాలుష్యం వెదజల్లుతున్నా పట్టించుకోరా..

- వాహనాల పాత బ్యాటరీల కాల్చివేత
- వాయు కాలుష్యంతో రోగాల బారిన ప్రజలు
- వ్యవసాయ విద్యుత్ వినియోగం?
- పట్టించుకోని అధికారులు... ప్రతినెలా మామూళ్లు?

## రుద్రారంలో అక్రమంగా లెడ్డు బట్టీల ఏర్పాటు?



సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలంలోని రుద్రారం శివారులో ఏర్పాటు చేసిన లెడ్డు బట్టీలు

పటాన్‌చెరు, జూన్ 15: ఎవరైనా ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలంటే గ్రామ పంచాయతీ ఎన్‌వోసీ నుంచి కాలుష్య నియంత్రణ మండలి, కార్మిక, అగ్నిమాపక శాఖలు, ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఇవేవి లేకుండా సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలంలోని రుద్రారం శివారులో వ్యవసాయ భూముల్లో లెడ్డు బట్టీలు ఏర్పాటు చేశారు. వాహనాలకు వినియోగించిన పాత బ్యాటరీలను కాల్చివేసి, రీసైక్లింగ్ చేసి పాత బ్యాటరీలో ఉండే లీడ్ అమ్లం, ప్లాస్టిక్ భాగాలు వేరుచేస్తున్నారు. లీడ్ కరిగించి మళ్లీ కొత్త బ్యాటరీల తయారీకి ఉపయోగిస్తారు. పాత బ్యాటరీలు నేరుగా కాల్చివేయడంతో వాతావరణ కాలుష్యం జరుగుతున్నది. లెడ్డు బట్టీలు ఏర్పాటు చేసి పాత బ్యాటరీలు కాల్చివేయడంతో సల్ఫ్యూరిక్, అమ్లం, కాడ్మియం, నికెల్ వ్యర్థ రసాయనాలు బయటకు వచ్చి వాయు కాలుష్యంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. రుద్రారం శివారులో 65వ నంబర్ జాతీయ రహదారికి సమీపంలో ఉన్న ఓ ప్రధాన హోటల్ వెనుక వ్యవసాయ భూమిలో లెడ్డు బట్టీలు ఏర్పాటు చేశారు. లెడ్డు బట్టీలో పనిచేసేందుకు బీహారు, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన కూలీలను తీసుకవచ్చి పనిలో పెట్టుకున్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా పాత బ్యాటరీలు కాల్చివేస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

### అనుమతులు లేకుండా...

రుద్రారం గ్రామ శివారులో కొందరు వ్యవసాయ భూములు లీజ్‌కు తీసుకొని లెడ్డు బట్టీలు ఏర్పాటు చేశారు. లెడ్డు బట్టీల్లో వాహనాల బ్యాటరీలు కాల్చివేస్తున్నారు. వ్యవసాయ భూములు లీజ్‌కు తీసుకుని ప్రభుత్వ అనుమతి లేకుండా పాత బ్యాటరీలు కాల్చి, అందులోని పదార్థాలు వేరుచేస్తున్నారు. స్థానిక రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో అక్రమంగా నడిపిస్తున్నారు. బ్యాటరీల్లో లెడ్డు, సల్ఫ్యూరిక్, అమ్లం, క్యాడియం, నికెల్ వ్యర్థ రసాయనాలు గాలిలో కలిచిపోవడంతో ప్రజలు రోగాలగు గురవుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసినా పంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. లెడ్డు బట్టీల నిర్వాహకులు ప్రతినెలా పంచాయతీ రాజ్, రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులకు మామూళ్లు ఇస్తున్నారని బహిరంగ ఆరోపణలు ఉన్నాయి. పంచాయతీ కార్యదర్శికి కొందరు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదనే తెలిసింది. నిర్వాహకులు అధికారులు, రాజకీయ నాయకులకు మామూళ్ల అప్పగించి వ్యాపారం జోరుగా సాగిస్తున్నారు. పాత బ్యాటరీలు తెలంగాణతో పాటు ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కొనుగోలు చేసి తెచ్చి ఇక్కడ కాల్చి వేస్తున్నారు. పాత బ్యాటరీలు నేరుగా కాల్చివేయడంతో లీడ్ ఆమ్లంతో వాతావరణం కలుషితం అవుతుందని, ప్రజారోగ్యానికి ఇది హానికరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. స్థానికంగా ఉండే అధికారులకు తెలిసినా చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లా అధికారులు స్పందించి అక్రమంగా నడిపిస్తున్న లెడ్డు బట్టీలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వ్యవసాయ భూములకు ఉపయోగించే కరెంట్‌ను లెడ్డు బట్టీలకు వినియోగిస్తున్నారని సమాచారం. కరెంట్ అధికారులకు ప్రతినెలా మామూళ్లు తీసుకుని చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రుద్రారంలో అక్రమంగా నడుస్తున్న లెడ్డు బట్టీల విషయంపై మండల పంచాయతీ అధికారికి వివరణ కోరేందుకు ఫోన్ చేయంగా, తమకు విషయం తెలియదు అని సమాధానంతో దాటవేశారు.



రుద్రారం శివారులో కొత్తగా నిర్మాణం చేస్తున్న లెడ్డు బట్టీలు



వాహనాలకు వినియోగించిన పాత బ్యాటరీలు

## విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



పదో తరగతి టాపర్లను సన్మానిస్తున్న డీఎస్పీ సైదానాయక్

జహీరాబాద్, జూన్ 15: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జహీరాబాద్ డీఎస్పీ సైదానాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం జహీరాబాద్ పట్టణంలోని ప్రాఫిట్‌షూ యాజమాన్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలోని పదో తరగతి టాపర్లను సన్మానించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు బోధించే పాఠాలను విద్యార్థులు చక్కగా విని మంచి మార్కులు సాధించాలన్నారు. ఉత్తమ విద్యార్థులను ప్రాఫిట్‌షూ యాజమాన్యం సన్మానించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, కెరీర్‌పై దృష్టిసారించి మంచి స్థానాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీబెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసీరాంరాథోడ్, ఉపాధ్యాయులు శిఖశేఖర్, విశ్వనాథ్, జనార్దన్‌రెడ్డి, ప్రాఫిట్‌షూ యజమాని అంబాజీ తదితరులు పాల్గొన్నారు.

## యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాల గురించి అవగాహన కల్పిస్తున్న రమేశ్‌జాజు

జహీరాబాద్, జూన్ 13: సంపూర్ణ ఆరోగ్యానికి యోగా సాధన చక్కని మార్గమని జహీరాబాద్ పతంజలి యోగా సమితి అధ్యక్షుడు రాజేశ్‌జాజు అన్నారు. ఆదివారం స్థానిక యోగా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ జీవితంలో యోగా భాగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యంగా జీవించేందుకు యోగసనాలను దోహద పడతాయన్నారు. ఈ శిబిరంలో ప్రతి రోజు ఉదయం 5.30 నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 5-30 నుంచి రాత్రి 7 గంటల వరకు యోగా తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ శిబిరాన్ని పట్టణంలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పతంజలి యోగా సమితి నాయకులు నారాయణరెడ్డి, కృష్ణ, రమేశ్, దత్తాత్రి, మల్లికార్జున్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఫాదర్స్ డే వేడుకలు



కేక్‌కట్ చేసి తన తండ్రికి తినిపించి శుభాకాంక్షలను తెలుపుతున్న కూతుళ్లు

జహీరాబాద్, జూన్ 15: జహీరాబాద్ పట్టణంలోని రాచన్నపేట్ కాలనీలో ఆదివారం అంతర్జాతీయ ఫాదర్స్ డే వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా కుమారులు, కూతుళ్లు కలిసి తండ్రి చేత కేక్‌కట్ చేసి తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. మన ఆశలే తన ఆయువుగా, మన గెలుపే తన లక్ష్యంగా, మన జీవితాన్ని నిలబెట్టేందుకు నిత్యం శ్రమించే నిస్వార్థ శ్రామికుడు, మన తొలి స్నేహితుడు నాన్న అని అన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పోస్టాఫీస్‌కు నూతన భవనం నిర్మించాలి



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న గంగా జోగినాథ్

అందోల్, జూన్ 15: జోగిపేటలోని పోస్టాఫీస్‌కు నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసినట్లు జోగిపేట ఏఎంసీ మాజీ చైర్మన్ గంగా జోగినాథ్ గుప్తా తెలిపారు. ఆదివారం కేంద్రమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన జోగినాథ్ జోగిపేట పోస్టాఫీస్ భవనం పాడైపోయిందని, దీంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. ఈ పోస్టాఫీస్ ద్వారా నిత్యం జోగిపేట పరిసర ప్రాంతాల వారికి నిత్యం ఎన్నో రకాల సేవలందుతున్నాయని, భవనం సరిగా లేకపోవడం ఇబ్బందిగా మారిందని, దీన్ని గుర్తించి భవనం నిర్మాణానికి సహకరించాలని కోరారు.

## పాఠశాలకు పూర్వ విద్యార్థుల సహాయం



పాఠశాలకు పూర్వ విద్యార్థులు అందజేసిన క్రీడా సామగ్రి

సంగారెడ్డి, జూన్ 15: తాము చదివిన పాఠశాల అభివృద్ధికి 2000-01 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు రూ.2లక్షలు అందజేశారు. ఆదివారం సంగారెడ్డి పట్టణంలోని ప్రశాంత్‌నగర్‌లోని సరస్వతి శిశుమందిర్ పాఠశాల పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసి గురువులను సత్కరించారు. తాము చదువుకున్న పాఠశాలకు ఏదైనా చేయాలనే తపనతో రూ.2లక్షలతో ప్లేస్కూల్ మెటీరియల్, ఫ్లోర్ మ్యాట్ వేయించారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని పూర్వ విద్యార్థులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో 25శాతం సీట్లు పేదలకు ఇవ్వాలి



మాట్లాడుతున్న జయరాజు

సంగారెడ్డి, జూన్ 15: పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్లు కేటాయించాలని, అధిక ఫీజులను నియంత్రించి ప్రైవేటు విద్యను పేదలకు అందచేయాలని సీపీఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జయరాజు డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టం అమలుపై ఆదివారం సంగారెడ్డిలోని పట్టణంలోని కేవల్ కిషన్ భవన్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హాజరైనా జయరాజు మాట్లాడుతూ.. విద్యాహక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల్లో 25శాతం ఫ్రీ సీట్లు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. 2009లో తెచ్చిన విద్యాహక్కు చట్టాన్ని జిల్లాలో అధికారులు అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. ఉచిత సీట్లు ఇవ్వకుండా ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు విద్యా వ్యాపారం చేస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. సమావేశంలో సీపీఎం నాయకులు రాజయ్య, శ్రీనివాస్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఎస్సై సుధాకర్ చారికి వీడ్కోలు



ఉద్యోగోన్నతిపై వెళ్తున్న సుధాకర్ చారిని సన్మానిస్తున్న సీఐ నయీముద్దీన్, ఎస్ఐ నాగలక్ష్మి

జిన్నారం, జూన్ 15: ఇటీవల ఎస్సైగా ఉద్యోగోన్నతి పొందిన జిన్నారం ఏఎస్సై సుధాకర్ చారి ఆదివారం విధుల నుంచి రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన కార్యక్రమంలో సుధాకర్ చారి అందించిన సేవలను సీఐ నయీముద్దీన్, ఎస్సై నాగలక్ష్మి కొనియాడారు. ఆయనను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. వీధి నిర్వహణలో అధికారులు, ఉద్యోగులు అందించిన సహకారం మరువలేనిదని సుధాకర్ చారి తెలిపారు. రిలీవ్ అయిన తర్వాత ఐజీ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో రిపోర్టు చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

- ప్రత్యేకాధికారుల పాలన అస్తవ్యస్తం

## పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

అందోల్, జూన్ 15: ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాల్లో పాలన అస్తవ్యస్తంగా మారింది. అందోల్ మండలంలోని అన్ని గ్రామాలో సమస్యలు వేధిస్తున్నాయి. పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలకు మురుగు కాల్వలు నిండి రోడ్లపై ప్రవహిస్తున్నాయి. వీధుల్లో చెత్త పేరుకుపోయి దుర్గంధం వ్యాపిస్తున్నది. ఇండ్ల మధ్య, జనావాసాల్లో సైతం పిచ్చి మొక్కలు పెరిగి విషసర్పాలు సంచరిస్తున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పిచ్చి మొక్కలు పెరిగి, వీధుల్లో చెత్త పేరుకుపోవడం, మురికి కాల్వలు నిండిపోవడంతో సాయంత్రం అయిందంటే దోమలు విజృంభిస్తున్నాయని పల్వట్ల, అల్మాయిపేట్ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో విష జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందని వాపోతున్నారు. పల్వట్ల గ్రామంలో తాగునీరు సరఫరా చేసే పైప్‌లైన్లలో లీకేజీలు ఏర్పడి, ఆ నీరంతా రోడ్డుపైకి చేరి పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతో పాటు తాగునీరు కలుషితమవుతున్నదని గ్రామస్తులు తెలిపారు. అధికాలు స్పందించి లీకేజీలు సరిచేసి పరిసరాలు శుభ్రం చేయాలని కోరుతున్నారు. అల్మాయిపేట్‌లో పారిశుధ్యం పడకేసింది. మురుగు కాల్వలు నిండి రోడ్లపైకి వస్తున్నా పట్టించుకునే వారే లేరని గ్రామస్తులుఏ ఆవేదన వ్యక్తం చేశారు.



పల్వట్ల గ్రామంలో ఇండ్ల మధ్యలో పెరిగిన పిచ్చిమొక్కలు



అల్మాయిపేటలో నిండిన మురుగుకాల్వలు



పల్వట్లలో పైప్‌లీకేజీతో రోడ్డుపై చేరిన నీరు

## నేడు రైతువేదికల్లో రైతునేస్తం వీసీ

కంగ్టి, జూన్ 15: కంగ్టి మండలంలోని తడ్కల్, గాజుల్‌పాడ్, కంగ్టిలోని రైతువేదికల్లో సోమవారం రైతులతో సీఎం రేవంత్ రెడ్డి ముఖాముఖి కార్యక్రమం ఉంటుందని మండల వ్యవసాయాధికారి హరీశ్ పవార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో నూతనంగా 1031 కేంద్రాల్లో రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని తెలిపారు. సీఎం కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం ఉంటుందని, రైతులు అధికసంఖ్యలో పాల్గొనాలని సూచించారు.

## కేతకీలో ఇంటెలిజెన్స్ ఎస్పీ పూజలు

ఝరాసంగం, జూన్ 15: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ఝరాసంగం కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయాన్ని ఆదివారం ఇంటెలిజెన్స్ ఎస్పీ శిరీష కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఇంటెలిజెన్స్ ఎస్పీకి ఆలయ రాజగోపురం వద్ద అర్చకులు మంత్రోచ్ఛారణ, మంగళవాయిద్యాల మధ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలోని అమృత గుండంలో పాదచారణ చేసి గర్భగుడిలోని పార్వతీసమేత సంగమేశ్వర స్వామి వారికి అభిషేకం, మంగళహారతి నిర్వహించారు. అనంతరం ఈవో శివరుద్రప్ప ఇంటెలిజెన్స్ ఎస్పీకి పూలమాల శాలువాతో సన్మానించి స్వామి వారి ప్రసాదాన్ని అందించారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ ఆదర్శ నూతన కార్యవర్గం

సంగారెడ్డి, జూన్ 15: లయన్స్ క్లబ్ ఆఫ్ సంగారెడ్డి ఆదర్శ 2025-26 ఏడాదికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేటు బాంక్వెట్ హాల్‌లో క్లబ్ సభ్యులు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో ప్రస్తుత అధ్యక్షుడు జార్జ్ మ్యాథ్యూ అధ్యక్షతన కొత్త కమిటీని ఎన్నుకున్నారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా పర్యాద రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కిరణ్‌గౌడ్, ఉపాధ్యక్షులుగావెంకటేశ్వర్‌రావు, పెద్దోటి శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారిగా వెంకటేశం, సహాయ కార్యదర్శిగా దూడం రామచంద్రం తదితరులను ఎన్నుకున్నారు. సమావేశంలో చైర్మన్లు పిల్లిగండ్ల రాములుగౌడ్, హన్మంత్‌గౌడ్, విజయేందర్‌రెడ్డి, నాయికోటి రామప్ప, లాడే మల్లేశం, సునీల్‌కుమార్, రఘుపతి ప్రభాకర్‌రెడ్డి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## గురువు జ్ఞాన దీపం

ఝరాసంగం, జూన్ 15: చీకటిలో దారి చూపే దీపం గురువు అని బర్దిపూర్ దత్తగిరి మహరాజ్ ఆశ్రమ పీఠాధిపతి 1008 మహామండలేశ్వర్ డాక్టర్ మహంత్ సిద్దేశ్వరానందగిరి మహరాజ్ అన్నారు. ఆదివారం దత్తగిరి మహారాజ్ వైదిక పాఠశాల 2025 సంవత్సరానికి మొదటి విడతగా ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటకకు చెందిన సుమారు 96 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారికి ఆశ్రమ పీఠాధిపతి, అర్చకులు, ఉపాధ్యాయులు మౌఖిక పరీక్ష నిర్వహించారు. అనంతరం తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. రెండో విడత పరీక్ష ఉంటుందని, త్వరలోనే తేదీని దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు తెలియజేస్తామని తెలిపారు. మొదటి విడతగా పరీక్షలు రాసిన విద్యార్థుల జాబితాను విద్యార్థుల తల్లిదండ్రులకు త్వరలోనే తెలియజేస్తామన్నారు.

## పోచమ్మ బస్తీలో సీసీ రోడ్డు పనులు



పోచమ్మ బస్తీలో సీసీ రోడ్డు పనులు ప్రారంభమైన దృశ్యం

జిన్నారం, జూన్ 15: బొల్లారం మున్సిపల్ పరిధిలోని పోచమ్మ బస్తీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. కాలనీలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా మున్సిపల్ సాధారణ నిధులతో ప్రారంభమైన పనులను యువజన నాయకుడు ఇమ్రాన్ పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరుపై సంతోషం వ్యక్తం చేస్తూ అధికారులకు, సహకరించిన నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. దశలవారీగా బస్తీలోని సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో బస్తీ వాసులు పాల్గొన్నారు.

## యువకుడి ఆత్మహత్య

అందోల్, జూన్ 15: మద్యానికి బానిసై మద్యం మత్తులో యువకుడు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు జోగిపేట ఎస్సై పాండు ఆదివారం తెలిపారు. జోగిపేట బుడగజంగాల కాలనీకి చెందిన శంకు శ్రీను(20) తల్లిదండ్రులు చిన్నతనంలోనే చనిపోవడంతో మేనమామ యాదయ్య వద్దే ఉంటున్నాడు. మద్యానికి అలవాటు పడిన శ్రీను, జీవితంపై విరక్తితో ఆదివారం జోగిపేట శివారులో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి మామ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.